సాక్షి అనంతపురం

సోమవారం । 7 । జూలై । 2025



ఊపందుకున్న నార్ల పెంపకం

హెచ్చెల్సీ పరిధిలోని ఆయకట్టు భూముల్లో నార్ల పెంపకం ఊపందుకుంది. మిరప, వరి నార్లకు డిమాండ్ పెరిగింది. 8లో



కనులపండువగా ఆషాఢ ఏకాదశి

పుట్టపర్తి పట్టణంలోని ప్రశాంతి నిలయంలో ఆదివారం ఆషాఢ ఏకాదశి వేడుకలు కనులపండువగా జరిగాయి. 8లో

గరిష్టం/కనిష్టం
33.4°/22.2°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నెట్టికంటుడి సన్నిధిలో కలెక్టర్ దంపతులు



కలెక్టర్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాన్ని అందజేశారు. అనంతరం తనను కలసిన ఆలయ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను కలెక్టర్ ఆలకించి, త్వరలోనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ దంపతులు సమీపంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు.

పీర్ల ఉత్సవంలో అపశ్రుతి



ఖయ్యూం (ఫైల్)

గుంతకల్లు: స్థానిక తాటాకులగేరిలో ఆదివారం జరిగిన పీర్ల ఉత్సవంలో అపశ్రుతి చోటు చేసుకుంది. పీరును ఎత్తుకున్న ఖయ్యూం (48) గుండెపోటుతో మృతిచెందాడు. ఫక్కీరప్ప కాలనీలో నివాసముంటున్న ఆయన గత 20 ఏళ్లుగా పీర్ల స్వాములను ఎత్తుకునేవాడు. ఈ క్రమంలో పెద్ద సరిగెత్తులో భాగంగా ఆదివారం వేకువజామున పీర్లు అగ్నిగుండ ప్రవేశం ఉత్సవాన్ని వేడుకగా చేపట్టారు. పీరును ఎత్తుకున్న ఖయ్యూం.. కాసేపటికే ఛాతీలో నొప్పిగా ఉందంటూ ఇతరులకు అప్పగించి, జెండా కట్ట వద్ద కూర్చొని నీళ్లు తాగిన వెంటనే కుప్పకూలిపోయాడు. వెంటనే సహచరులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. గుండెపోటు కారణంగానే ఆయన మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే శ్రావణికి భంగపాటు

బుక్కరాయసముద్రం: టీడీపీ మండల కన్వీనర్ ఎంపిక విషయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి వర్గీయులకు భంగపాటు తప్పలేదు. బీకేఎస్ మండల కేంద్రంలోని దేవరకొండ వద్ద ఆదివారం కన్వీనర్ ఎంపిక విషయంపై టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్నికల పరిశీలకుడు మల్లికార్జున, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు హాజరయ్యారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి గైర్హాజరయ్యారు. టీడీపీ కన్వీనర్ పదవి కోసం బీకేఎస్ మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే వర్గీయుడైన ఈశ్వరయ్య మధ్య పోటీ నెలకొంది. అయితే సమావేశంలో 90 శాతం మంది లక్ష్మీనారాయణకు మద్దతు తెలిపారు. ఆయన్ను కన్వీనర్‌గా ఎంపిక చేయకపోతే పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తామంటూ ఆడియో రికార్డు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే శ్రావణికి చుక్కెదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

పరిశ్రమల జాడేదీ..?



- ఏడాది ముగిసినా చిన్న పరిశ్రమకూ దిక్కులేదు
- లక్షల్లో ఉద్యోగాలని ఒక్కటీ ఇవ్వలేదు
- ఎంఎస్‌ఎంఈలు పెట్టడానికీ మొగ్గుచూపని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు
- రాప్తాడులో దారుణ పరిస్థితుల నేపథ్యంలో అటువైపే చూడని వైనం
- పెనుకొండ, హిందూపురం పట్టణాల్లోనూ ఇంతే...
- ఉద్యోగాలు లేక, నిరుద్యోగ భృతి అందక అల్లాడిపోతున్న నిరుద్యోగులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడాదిగా విచిత్ర పరిస్థితి నెలకొంది. 'మిమ్మల్ని లక్షాధికారులను చేస్తాం, ఇంటింటికీ ఉద్యోగమిస్తాం, లేకుంటే నిరుద్యోగ భృతి అందిస్తాం' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన టీడీపీ నేతల నోట ఆ మాటే నేడు రావడం లేదు. ఆ మాటలు ఇప్పుడు వారికి కొరగానివిగా తయారయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా రాప్తాడు, పెనుకొండ, హిందూపురం ప్రాంతాలు చిన్న, సూక్ష్మ, భారీ పరిశ్రమలకు అనుకూలం. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు ప్రాంతాల్లోనూ ఇప్పటివరకూ ఒక్క కొత్త పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. ఎంఎస్‌ఎంఈల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది.

అరాచకాలతో రాంరాం..

జిల్లాలో రాప్తాడు నియోజకవర్గం పరిశ్రమల ఏర్పాటుకు బాగా అనుకూలమని చెబుతారు. నియోజక వర్గం గుండా జాతీయ రహదారి వెళ్తుండడం, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి వేగంగా చేరుకునే అవకాశం తదితర సానుకూలతలున్నా హత్యలు, భూకబ్జాలు, ఆక్రమణలు, రౌడీయిజం, దొంగతనాలు వెరసి చిన్న పారిశ్రామికవేత్తలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం లేదు. శాంతిభద్రతలు అదుపుతప్పడంతో పారిశ్రామికవేత్తలు ఇక్కడకు రావడానికి వెనకాడుతున్నారు. గడిచిన ఏడాదిలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా వచ్చిన పాపాన పోలేదు. 'కొత్త పారిశ్రామిక పాలసీ తెచ్చాం, పెట్టుబడులు పెట్టండి' అంటూ అధికారులు ఎంత బతిమాలినా 'మాకొద్దు బాబూ' అంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో కొత్త ఉద్యోగాలు రాకపోవడంతో పాటు ఉన్న ఉద్యోగాలకు కూడా గండం ఏర్పడింది.

పెనుకొండ.. హిందూపురంలోనూ అంతే

పెనుకొండ, హిందూపురం ప్రశాంతంగా ఉండే పట్టణాలు. అలాంటిది నేడు రాజకీయ నాయకుల అండతో టీడీపీ కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. స్వయానా ప్రజాప్రతినిధులే ఉసిగొలిపి ఇదంతా చేయిస్తున్నారు. పెనుకొండలో ఓ రీమిక్స్‌ప్లాంట్ యాజమాన్యాన్ని స్వయానా మంత్రి బెదిరించడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. చిన్న పరిశ్రమ నెలకొల్పడానికి ఎవరైనా వచ్చినా వసూళ్లకు తెగబడుతున్నారు. హిందూపురంలో ఎమ్మెల్యే పీఏలుగా చెప్పుకుంటూ కొందరు చేస్తున్న అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. కూటమి సర్కారు వచ్చినప్పటినుంచీ అక్కడ ఒక్క కొత్త పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. మద్యం, జూదం తీవ్రస్థాయిలో జరుగుతుండటంతో పెట్టుబడిదారులు హిందూపురం రావడానికి మొగ్గు చూపడం లేదు. ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం అదీ ఇవ్వలేదు.

2019-2024లో ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల పరిస్థితి

ఎంఎస్‌ఎంఈలు	43,491
పెట్టుబడులు వచ్చినది	రూ.1,996 కోట్లు
ఉద్యోగాల కల్పన	1,62,135

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎంఎస్‌ఎంఈల పరిస్థితి ఇలా

కేటగిరీ ఏజెన్సీ	పరిశ్రమల దరఖాస్తులు	సబ్సిడీ రుణం
డీఐసీ	71	రూ.2.01 కోట్లు
కేవీఐబీ	56	రూ.1.60 కోట్లు
కేవీఐసీ	43	రూ.1.17 కోట్లు
మొత్తం	170	రూ.4.78 కోట్లు

పకడ్బందీగా మెగా పీటీఎం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 2.0ను ఈనెల 10న పకడ్బందీగా నిర్వహించాలి. రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా రికార్డు స్థాయిలో జరపాలి' అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, దాతలు, ఎస్ఎంసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లోనే కాకుండా ఇంటర్ కళాశాలల్లోనూ నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలకు డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బందిని నియమించాలన్నారు. ప్రక్రియను ఎంపీడీఓలు పర్యవేక్షించాలని, ప్రతి పాఠశాలలోనూ ఒక పోలీసు ఉండాలన్నారు. చివరగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. మెగా పీటీఎం 2.0కు సంబంధించి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఎఫ్ఓ విగ్నేష్ అప్పావు, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో..

పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 2.0 నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 1,739 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 676 ప్రైవేటు పాఠశాలలో మొత్తం 2,415 పాఠశాలలు, 28 ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు, 68 ప్రైవేటు కళాశాలలో మొత్తం 96 కళాశాలల్లో కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. పీటీఎం 2.0లో 4,37,777 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. 'చదువుల్లో తల్లి పాత్ర' అనే అంశంపై పిల్లలకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు.

ఇతరులకు చెబుతాం.. ఆచరించం!

రెవెన్యూ 'రూటే' వేరు

- పదోన్నతుల కల్పనలో ఏడాదిగా జాప్యం
- మండలాల్లో ఇంకా ఇన్‌చార్జ్‌ల పాలనే
- బదిలీల్లో కానరాని పారదర్శకత
- కొండెక్కిన వాహనాలు, పాత సామగ్రి వేలం



కలెక్టర్ కార్యాలయం

అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న రెవెన్యూ శాఖ తన సొంత ఉద్యోగుల నుంచే విమర్శలు మూటగట్టుకుంటోంది. మా 'రూటే' వేరయా అంటూ ఉద్యోగులు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇతరులకు చెబుతాం.. మేం ఆచరించం అన్నట్లుగా ఇక్కడ పరిస్థితి తయారైంది. పదోన్నతుల కల్పన.. మండలాల్లో ఇన్‌చార్జ్ పాలన.. బదిలీలు.. చివరికి వాహనాలు, పాత సామగ్రి వేలం విషయంలో ఇతర శాఖలకు ఇచ్చిన ఆదేశాలు ఈ శాఖలో మాత్రం అమలు కావనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

పదోన్నతులేవీ...?

'ఉద్యోగులకు పదోన్నతులు సకాలంలో కల్పించాలి.. విమర్శలకు తావివ్వకుండా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి' అని ఇతర శాఖలకు రెవెన్యూ ఉన్నతాధికారులు ఆదేశాలిస్తారు. తమ శాఖలో ఆ ఆదేశాలు అమలవుతున్నాయో లేదో మాత్రం పట్టించుకోరు. ఇక్కడి ఉద్యోగులకు పదోన్నతులు ఎండమావిగా మారాయి. వివిధ కేటగిరీలకు సంబంధించి పదోన్నతుల ప్రక్రియ నిర్వహణలో ఏడాదిగా జాప్యం జరుగుతోంది. పదోన్నతి ఎప్పుడు కల్పిస్తారోనని ఉద్యోగులు చకోరపక్షుల్లా ఎదురు చూస్తున్నారు.

ఇంకా ఇన్‌చార్జ్ పాలనే..

''ఏ శాఖలోనూ ఇన్‌చార్జ్ పాలన ఉండకూడదు... రెగ్యులర్ అధికారిని నియమించాలని ఉన్నతాధికారులకు లేఖలు రాయండి'' అంటూ ఇతర ప్రభుత్వ శాఖలకు ఆదేశాలిస్తున్న రెవెన్యూ ఉన్నతాధికారులు తమ శాఖలో మాత్రం ఇన్‌చార్జ్ పాలనకు స్వస్తి చెప్పడం లేదు. జిల్లావ్యాప్తంగా దాదాపు ఐదారు మండలాలకు తహసీల్దార్లను నియమించకుండా ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తుండడమే దీనికి నిదర్శనం. స్వయంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని కూడేరు మండలానికి తహసీల్దారును నియమించకుండా ఇన్‌చార్జ్‌తోనే కాలం నెట్టుకొస్తున్నారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సామగ్రి తుప్పపట్టి పోవాల్సిందేనా


అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయం వెనుక దాదాపు 12 పాత వాహనాలు మూలనపడ్డాయి. కండీషన్‌లో ఉన్నవాటిని కూడా పడేయడంతో ఇప్పుడు ఎందుకూ పనిరాకుండా తయారయ్యాయి. కొత్త సామగ్రి రావడంతో పాత బీరువాలు, ఇనుప ర్యాక్‌లు తదితర వస్తువులు కార్యాలయ ఆవరణలో పడేశారు. అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ చివరికి గుజరీకి కూడా పనికిరాకుండా పోతున్నాయి. మీ శాఖల పరిధిలో పాత వాహనాలు, సామగ్రిని బహిరంగ వేలం వేయండి అంటూ ఇతర శాఖలకు గడువులు విధిస్తున్న రెవెన్యూ అధికారులు తమ దగ్గర ఉన్న సామగ్రిని పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బదిలీ బంతాట..

'బదిలీల ప్రక్రియ విమర్శలకు, వివాదాలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలి' అని ఇతర శాఖలకు రెవెన్యూ ఉన్నతాధికారులు ఆదేశాలిస్తారు. కానీ, అదే శాఖలో నిర్వహించే బదిలీల ప్రక్రియలో పారదర్శకతను గాలికొదిలారు. ఇటీవల తహసీల్దార్ల బదిలీలు, పోస్టింగ్ విషయంలో ఈ విషయం స్పష్టమైంది. విమర్శలకు తావిచ్చేలా ప్రక్రియ నిర్వహించారు. ఒకసారి ఇచ్చిన స్థానాలను మార్పు చేస్తూ మరో ఉత్తర్వు... దాన్ని మార్పు చేస్తూ ఇంకో ఉత్తర్వు... ఇలా బంతిలా తహసీల్దార్లను బదిలీలతో ఆడుకున్నారు.

టీబీ డ్యాంకు కొత్త శోభ..

విద్యుద్దీపాల వెలుగులో తుంగభద్ర జలాశయం



బొమ్మనహాళ్: తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతుండడంతో టీబీ డ్యాం కొత్త శోభ సంతరించుకుంది. వరద ఉధృతి పెరుగుతుండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై మొదటి వారంలోనే డ్యాం 19 క్రస్ట్ గేట్లను పైకెత్తి నీటిని నదికి వదులుతున్నారు. ఆదివారం 54,815 క్యూసెక్కులు నదికి, 6 వేల క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు పంపారు. డ్యాంలో 77 టీఎంసీలు నిల్వ ఉంచి, మిగిలిన నీటిని నదికి వదులుతున్నారు. మరో 4 రోజుల్లో హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించడంతో ఆయకట్టు రైతులు వరినార్లతో పాటు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 1,633 అడుగులకు గాను 1,625.21 అడుగులకు నీరు చేరింది. ఇన్‌ఫ్లో 52,805 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 62,027 క్యూసెక్కులుగా ఉంది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 77.180 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1,593.19 అడుగుల వద్ద 13.900 టీఎంసీల నీటి నిల్వతో, 25,556 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 190 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండిందని అధికారులు తెలిపారు.

నేడు పామిడిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం పామిడి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. పామిడి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్జీల స్థితిగతులను 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలను పరిష్కార వేదికలోనే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చన్నారు.

గూగూడు క్షేత్రం.. భక్తజన సాగరం



గూగూడు కుళ్లాయిస్వామి పీర్లు



అగ్నిగుండం వద్ద భక్తుల రద్దీ

నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి క్షేత్రం భక్తజన సాగరమైంది. గూగూడు కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆది వారం పెద్ద సరిగెత్తు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గూగూడు కిటకిటలాడింది. తెల్లవారుజామున స్వామి వారిని అర్చకులు హుసేనప్ప ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. నాయీ బ్రాహ్మణులు సన్నాయి వాయిద్యాలతో నీరాజనాలర్పించగా.. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు పొర్లు దండాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఫకీర్లు పానకాలు సమర్పించుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. – నార్పల



పొర్లు దండాలతో మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు



స్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు



పానకాలు తీసుకెళ్తున్న భక్తులు

క్లుప్తంగా

ఘనంగా మన్రో వర్ధంతి



మన్రో సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి: దత్త మండలాల కలెక్టర్ సర్ థామస్ మన్రో 198వ వర్ధంతిని గుత్తి కోట సంరక్షణ సమితి , మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోట వీధిలో ఉన్న సర్ థామస్ మన్రో సమాధిపై పూలు చల్లి నివాళులర్పించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, గైడ్ రమేష్ మాట్లాడుతూ.. సర్ థామస్ మన్రో సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, కళాకారుడు విజయకుమార్, కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సభ్యులు దస్తగిరి, నిజాం, జిలాన్, నరసింహ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు వేదిక కానున్న ఉరవకొండ



జిల్లా స్థాయి యోగా పోటీల నిర్వహణపై చర్చిస్తున్న యోగ, ఆయూష్ ప్రతినిధులు

ఉరవకొండ: జిల్లా స్థాయి యోగా పోటీలకు ఉరవకొండ వేదిక కానుంది. ఈ పోటీల నిర్వహణకు సంబంధించి స్థానిక మార్కండేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆయూష్ కార్యాలయంలో యోగా గురువులు, ఆయూష్ ప్రతినిధులు ఆదివారం సమావేశమై చర్చించారు. అనంతరం స్థానిక ఆయూస్ ప్రతినిధులు వెంకట్ తాడికొండ, సుధాకర్‌రెడ్డి, నాగమల్లి ఓబులేసు, అనంతపురం ప్రతినిధులు రాజశేఖరరెడ్డి, దివాకర్, మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆగస్టు 3న ఉరవకొండలో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అసోసియేషన్ ఆఫ్ యోగ ఇన్ ఉరవకొండ వారి సహకారంతో సిలబస్ ఆధారంగా యోగాసన, రిథమిక్, యోగ, ఆర్టిస్టిక్‌పై పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు.

ఊపందుకున్న నార్ల పెంపకం

- మిరప, వరి నార్లకు పెరిగిన డిమాండ్
- 10న హెచ్చెల్సీకి నీటి విడుదల

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) పరిధిలోని ఆయకట్టు భూముల్లో ముందస్తు నార్ల పెంపకం ఊపందుకుంది. ఈ నెల 10 తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదలపై ఇప్పటికే టీబీ బోర్డు అధికారులు స్పష్టత ఇవ్వడంతో జిల్లాలో మిరప, వరి పైర్లకు డిమాండ్ పెరిగింది. దీంతో హెచ్చెల్సీ పరిధిలో బోరుబావుల కింద నార్ల పెంపకం చేపట్టారు. బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్‌తో పాటు కర్ణాటకలోని బళ్లారి జిల్లా పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు దేవగిరి క్రాస్, దేవగిరి, బెంచికొట్టాలు, కణేకల్లు క్రాస్, ఉంతకల్లు గ్రామాల్లో నర్సరీలు, పొలాల్లో బోర్ల కింద ముందస్తుగా మిరప నార్లు పోసేందుకు పోటీ పడుతున్నారు.

పెరుగుతున్న నార్ల ధరలు

మార్కెట్‌లో రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకున్న కొందరు వ్యాపారులు విత్తన ధరలను అమాంతం పెంచి విక్రయాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం వివిధ కంపెనీలకు చెందిన మిరప విత్తనాలు డిమాండ్‌ను బట్టి కిలో రూ.25 వేల నుంచి రూ. లక్ష వరకు ధర పలుకుతున్నాయి. బ్యాడిగ మిరప విత్తనాల కోసం రైతులు కర్ణాటకలోని బ్యాడిగ పట్టణానికి వెళ్లి కిలో రూ. 900 చొప్పున



బోర్ల కింద సాగైన మిరప నార్లు

మిరప కాయలను కొనుగోలు చేసి విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరికొందరు రైతులు విడపనకల్లు మండలం వేల్పుమడుగు, ఆర్ కొట్టాల గ్రామాల్లో రైతుల వద్ద నుంచి బ్యాడిగ, డీలెక్స్, డబ్బీ కాయలను స్థానికంగానే కిలో రూ. 700 నుంచి రూ. 900 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. బొమ్మనహాళ్, కనేకల్లు మండలాల్లో హెచ్చెల్సీ కింద వరి పంట సాగు ఎక్కువగా ఉన్నందున వరి నార్లకు భారీగా డిమాండ్ నెలకొంది. బీపీటీ సోనా, ఎన్ఎల్ఆర్, ఆర్ఎన్ఆర్ రకాలకు చెందిన వరి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు కర్ణాటకలోని కంప్లి వద్ద ఉన్న వసికేరి క్యాంపు నుంచి వరి విత్తనాలను తీసుకొస్తున్నారు. ప్రస్తుతం 30 కిలోల విత్తనం రూ. 1,450 ధర పలుకుతోంది. ఇక స్థానికంగా రైతులు పండించిన బీపీటీ సోనా 70 కిలోల విత్తనమైతే రూ.3,200, ఎల్ఎల్ఆర్ రూ.3,800, ఆర్ఎన్ఆర్ రూ.3,800 వరకు ధర పలుకుతున్నాయి. పత్తి విత్తనాలు కూడా 450 గ్రాములు రూ. 900 నుంచి రూ. వెయ్యి వరకు విక్రయిస్తున్నారు. మొక్కజొన్న విత్తనాలు నాలుగు కిలోలు రూ.1,600 నుంచి రూ. 1,800 వరకు అమ్ముడు పోతోంది. ప్రభుత్వం రైతులకు ఇచ్చే రాయితీ విత్తనాలు కూడా సక్రమంగా పంపిణీ కాక పోవడంతో రైతులు బహిరంగ మార్కెట్‌కు వెళ్లి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో క్వింటా వేరుశనగ విత్తన కాయలు రూ.6,800 వరకు ధర పలుకుతోంది.

సెంటు స్థలం అద్దె రూ.700

బోర్లు లేని రైతులు బోరుబావులు ఉన్న రైతుల వద్ద ముందస్తుగా నార్లు పెంచుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సెంటు స్థలం, నీటికి రూ.700 అద్దె చెల్లిస్తున్నారు. ముందస్తుగా వరి నార్లు పెంచుకుటే రైతులకు 40 రోజుల నీరు ఆదా అవుతుంది. హెచ్చెల్సీకి నీరు అందగానే వరి, మిరప నార్లు వేసుకునేందుకు ఉపయోగపడుతుంది.

రైతులు జాగ్రత్త వహించాలి



విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు చాలా జాగ్రత్త వహించాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయడంతో పాటు అందుకు తగిన రసీదును తీసుకోవాలి. కర్ణాటకలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలి.

– సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

బేల్దారి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న చాంద్‌బాషా

రాయదుర్గం టౌన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని భంభం స్వామి లే అవుట్ సమీపంలో నివాసముంటున్న చాంద్‌బాషా (25) బేల్దారి పనులతో కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. కొంత కాలంగా సరైన పనులు లేకపోవడంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తారాస్థాయికి చేరుకున్నాయి. దీంతో మనస్తాపం చెందిన చాంద్‌బాషా ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమై శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తన ఇంటికి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపైకి చేరుకుని కూర్చొన్నాడు. కాసేపటి తర్వాత ఆ మార్గంలో వచ్చిన హొస్పేట-యశ్వంత్‌పూర్ రైలు ఢీ కొనడంతో చాంద్‌బాషా ఎగిరి పట్టాలకు అవతల పడ్డాడు. లోకో పైలెట్ సమాచారంతో రైల్వే ఎస్ఐ మహేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలకు తీవ్రమైన గాయంతో అపస్మారక స్థితిలో చేరుకున్న చాంద్‌బాషాను వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యం తాళలేక బలవన్మరణం

రాప్తాడు: అనారోగ్యం తాళలేక జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని హమాలీ కాలనీలో నివాసముంటున్న వెన్నపూస విజయశేఖరరెడ్డి (39), మీన దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. విజయశేఖర్ రెడ్డి గిఫ్ట్ అండ్ నావల్టీస్ షాపు నిర్వహిస్తుండగా, మీన టైలరింగ్‌తో కుటుంబానికి చేదోడుగా నిలిచింది. 2015లో చోటు చేసుకున్న ప్రమాదంలో విజయశేఖర్‌రెడ్డి వెన్నెముకతో పాటు తలకూ బలమైన గాయాలయ్యాయి. చికిత్స అనంతరం కోలుకున్నా... నరాల సంబంధిత వ్యాధితో తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. కట్టె సాయం లేనిదే అడుగు కూడా వేయలేని స్థితిలో తీవ్ర మానసిక క్షోభను అనుభవించిన ఆయన 2018, 2019లో రెండు సార్లు విషపూరిత ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆయా సమయాల్లో కుటుంబ సభ్యులు



మృతుడు విజయశేఖర్ రెడ్డి

వెంటనే గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ నెల 4న సాయంత్రం తన తల్లిదండ్రులను మాట్లాడి వస్తానంటూ ఇంట్లో తెలిపి ఎలక్ట్రిక్ లగేజ్ ఆటో తీసుకుని బయలుదేరిన ఆయన ఆ తర్వాత ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం ప్రసన్నాయపల్లి గ్రామ సచివాలయం సమీపంలో ఆటోలో వెనుక వైపు ఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని వెన్నపూస విజయశేఖరరెడ్డిగా అనుమానిస్తూ సమాచారం ఇవ్వడంతో భార్య మీన అక్కడకు చేరుకుని పరిశీలించి నిర్ధారించారు. మృతుడి వద్ద మద్యం బాటిళ్లు, విషపు గుళికల బాటిళ్లు లభ్యం అయ్యాయి. మీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

‘కలుషిత నీరు కలకలం’పై విచారణ

గుంతకల్లు: పట్టణంలో కలుషిత నీరు తాగి పలువురు అస్వస్థతకు గురైన అంశంపై అధికారులు విచారణ చేపట్టారు. గుంతకల్లులోని 11వ వార్డులో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటనపై ‘కలుషిత నీరు కలకలం’ శీర్షికన ఆదివారం ‘సాక్షి’లో వెలువడిన కథనంపై ప్రజారోగ్యశాఖ ఎస్ఈ రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్ స్పందించారు. ఆదివారం ఉదయం మున్సిపల్ అధికారులతో కలసి వారు 11వ వార్డులోని సాయి కృష్ణ ఆస్పత్రిలో సమీపసంలోని వీధిలో పర్యటించారు. కలుషిత నీటి సరఫరాపై వివరాలు ఆరా తీశారు. ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. అటు నుంచి నేరుగా మున్సిపల్ కమిషనర్ చాంబర్‌కు చేరుకుని అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతోపాటు అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు.



ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న అధికారులు

పైపులైన్ లీకేజ్‌లతోపాటు మురికి కాలవలో ఉన్న తాగునీటి పైపులైన్ గుర్తించి వాటిని మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కొందరు ప్రైవేట్ ప్లాంట్‌ల నిర్వాకులు సరఫరా చేసిన ప్యూరిఫైడ్ నీటిని తాగిన వారున్నారని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టినట్లు తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్ట్ వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈ షబానా, ఏఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

ఫిల్టర్‌బెడ్స్ పరిశీలన

గుంతకల్లు టౌన్: స్థానిక తిలక్‌నగర్‌లో కలుషిత నీరు తాగి పలువురు ఆస్పత్రి పాలైన నేపథ్యంలో ఆదివారం ఉదయం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. తిలక్‌నగర్‌లో కొళాయి ద్వారా సరఫరా అయిన నీటిలో నాణ్యతా పరీక్షలు చేపట్టగా, నీరు కలుషితం కాలేదని తేలినట్లు వెల్లడించారు. అనంతరం సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌లో నీటి నిల్వలతో పాటు ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలించారు. ఈఎల్ఎస్ఆర్ ట్యాంకు నుంచి సేకరించిన నీటిని పరీక్షల నిమిత్తం కర్నూలులోని మెడికల్ కళాశాల ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్టు రాగానే పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్, ఎంఈ ఇంతియాజ్, ఇతర అధికారులు ఉన్నారు.

చెట్టు లేకుంటే అక్షరమే లేదు

- ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అనంతపురం కల్చరల్: మనిషి మనుగడకు జీవనాధారమైన చెట్టు లేకుంటే సాహిత్యానికి ఊతమైన అక్షరమే లేదని డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీతలు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ అన్నారు. ద్విభాషా కవి జూటూరు షరీఫ్ రాసిన ‘చెట్టు’ వచన శతకాన్ని ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో వారు ఆవిష్కరించారు. ఉప్పరపాటి వెంకటేశులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకే శ్రీనివాస్ పుస్తక సమీక్ష చేశారు. సీనియర్ కవులు తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, మురళీకృష్ణ, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాయుడు, రియాజుద్దీన్, డాక్టర్ తన్నీరు నాగేంద్ర తదితరులు మాట్లాడుతూ.. షరీఫ్ విలక్షణ కవితా లక్షణాలను కొనియాడారు. గౌరవ అతిథిగా విచ్చేసిన రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. చెట్టు వంటి కవితా సంకలనాలు సమాజాన్ని చైతన్య పరుస్తాయని అన్నారు. అంతకు ముందు ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం ఆకట్టుకుంది. అనంతరం జూటూరు షరీఫ్‌కు సాహితీ సంస్థల నిర్వాహకులు చం.శాస్త్రి, జిరసం ప్రతినిధులు కొత్తపల్లి సురేష్, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ రెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, జెన్నే ఆనంద్, మహాబోధి కృష్ణమూర్తి, గోరా, సూర్యనారాయణరెడ్డి తదితరులు ఆత్మీయ సన్మానం చేశారు.

రైల్లో నుంచి జారి పడి ప్రయాణికుడి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుత్తి/పెద్దవడుగూరు: స్థానిక జీఆర్‌పీ పరిధిలోని మిడుతూరు సమీపంలో ఆదివారం రైలు నుంచి జారి పడి ఓ గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న గుత్తి జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు గుత్తి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ నాగప్ప కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కనుల పండువగా ఆషాఢ ఏకాదశి



ప్రశాంతి నిలయంలో దిండి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు



భారతీయ సాధువుల వైభవాన్ని చాటుతూ బాలవికాస్ చిన్నారుల ప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యసాయి భక్తుల నడుమ ప్రశాంతి నిలయంలో ఆషాఢ ఏకాదశి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఆదివారం ఉదయం మహారాష్ట్ర, గోవా సత్యసాయి భక్తులు సాయిని కీర్తిస్తూ దిండి పల్లకీని ఊరేగింపుగా మహాసమాధి చెంతకు తీసుకువచ్చారు. పాండురంగడు.. సత్యసాయిల అవతార లక్ష్యం ఒక్కటేనన్న సందేశాన్నిస్తూ బాలవికాస్ చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. సనాతన భారత చరిత్రలో అనేకమంది సాధువులు మనిషిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపిన తీరును చక్కగా వివరించారు. సాయంత్రం మహారాష్ట్ర, గోవా బాలవికాస్ చిన్నారులు ‘వాల్యూస్ వర్సెస్ వాల్యూస్’ పేరుతో మనిషి నిత్య జీవితంలో విలువలు పాటించాల్సిన ఆవశ్యకతను, పురాణాల ఆధారంగా విలువల ప్రాముఖ్యతను వివరిస్తూ చక్కటి ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు.

యువకుడిపై కత్తితో దాడి



గాయపడిన నూర్‌మహమ్మద్

హిందూపురం: స్థానిక సత్యసాయి నగర్‌లో పాత కక్షల కారణంగా యువకుడు నూర్ మహమ్మద్ కత్తి పోట్లకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రాఖీబ్ అలియాస్ టోప్రా కత్తితో దాడి చేయడంతో ముఖం, గొంతుపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. కాగా, గతంలో ఇద్దరూ మంచి స్నేహితులుగా ఉండేవారని, కొంతకాలంగా విభేదాలతో కక్షలు పెంచుకున్నట్లు తెలిసింది. దాడి చేసిన అనంతరం రాఖీబ్ నేరుగా వన్‌టౌన్ పీఎస్‌కు చేరుకుని లొంగిపోయినట్లు సమాచారం.

అ‘పూర్వ’ కలయిక

నాటి గురువులతో పూర్వ విద్యార్థులు



యాడికి: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1979–80లో పదో తరగతి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకూ కలసి చదువుకున్న వీరు... తమ తరగతి గదులను ఆప్యాయంగా తాకుతూ తన్మయత్వంతో మురిసిపోయారు. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన వారందరూ 46ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు విజయభాస్కర రెడ్డి, సుబ్బారెడ్డి, కేశవరెడ్డిను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు చవ్వా గోపాలరెడ్డి, సారెడ్డి రామశేఖరరెడ్డి, మల్లారెడ్డి, ధ్రువనారాయణ, ఈశ్వరప్ప, సాధు శేఖర్ తదితరులు నేతృత్వం వహించారు.

ఇల్లు ఇవ్వరు.. డిపాజిట్లూ వెనక్కివ్వరు!

‘ఇల్లయినా ఇవ్వండి, లేకపోతే మేం చెల్లించిన డిపాజిట్లు తిరిగిచ్చేయండి’ అంటూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. అయినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా పోయింది.

- టిడ్కో గృహాలపై అయోమయం
- రూ.3 కోట్ల డిపాజిట్ల సొమ్ము చెల్లింపుపై ప్రభుత్వం మీనమేషాలు
- మునిసిపల్ కార్యాయం చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

తాడిపత్రి రూరల్: టిడ్కో డిపాజిట్ల కోసం ఏళ్ల తరబడి కళ్లు కాయలు కాచేలా చూసిన లబ్ధిదారుల్లో సహనం చచ్చిపోయింది. గత టీడీపీ ప్రభుత్వంలో చెల్లించిన డిపాజిట్లు తిరిగి కూటమి అధికారంలోకి వచ్చినా చెల్లించకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో టిడ్కో డిపాజిట్ల చెల్లింపులో సాంకేతిక కారణాలతో చోటు చేసుకున్న జాప్యంపై అప్పటి ప్రతిపక్ష హోదాలో టీడీపీ నేతలు నానాయాగీ చేశారు. 2024లో బీజేపీ, జనసేన అండతో అధికారం చేపట్టిన తర్వాత కూడా టిడ్కో డిపాజిట్ల చెల్లింపులో కూటమి పెద్దలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో లబ్ధిదారుల్లో అసహనం పెరిగిపోతోంది.

2018లో డిపాజిట్లు

2018లో పట్టణ సదుపాయాల కల్పన అభివృద్ధి (టిడ్కో)కింద అప్పటి టీడీపీ ప్రభుత్వం షీర్‌వాల్ టెక్నాలజీ విధానంతో పేదలకు గృహ నిర్మాణాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో తాడిపత్రి పట్టణ సమీపంలోని ఇందిరమ్మ గృహాల వద్ద మొత్తం 5,184 మందికి టిడ్కో గృహాలను నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తొలి విడతగా 2,304, రెండో విడతగా 2,880 మందికి ప్లాట్లను కేటాయించారు. 300, 365, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు రకాల గృహాలను నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. విస్తీర్ణాన్ని బట్టి లబ్ధిదారుల నుంచి డిపాజిట్లు సేకరించింది. లబ్ధిదారులు రూ.25వేలు, రూ.50వేలు డిపాజిట్లను డీడీల రూపంలో మునిసిపల్ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. వివిధ కారణాలతో 1,136 మంది లబ్ధిదారుల పట్టాలను అప్పట్లో అధికారులు రద్దు చేశారు.



ముళ్ల కంపల మధ్య టిడ్కో గృహాలు

చెల్లింపులో అంతులేని జాప్యం

తాడిపత్రిలోని టిడ్కో గృహాల కోసం డిపాజిట్లు చెల్లించి భంగపడిన 1,136 మందికి రూ.3 కోట్లకు బకాయిలు చెల్లించడంలో కూటమి సర్కార్ అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తోంది. కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల సొంతింటి కలను సాకారం చేసేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. జగనన్న కాలనీల పేరుతో వేలాది మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తూ ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. ఈ క్రమంలో టిడ్కో లబ్ధి చేకూరని 350 మంది అటువైపుగా మొగ్గుచూపారు. వీరితో పాటు దరఖాస్తులు తిరస్కరణకు గురైన 786 మందికి డిపాజిట్లు వెనక్కు చెల్లించాల్సి ఉంది. ఈ డిపాజిట్లను ఇప్పట్లో చెల్లించే అవకాశాలు కనిపించకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

పెండింగ్ పనుల పూర్తిలో అలసత్వం

పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాల పనులను జగన్ ప్రభుత్వం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసింది. ఈ క్రమంలోనే మౌలిక సదుపాయాల కల్పనకు నిధులనూ మంజూరు చేసింది. మిగిలిన పనులను పూర్తి చేసే లోపు రాష్ట్రంలో ఎన్నికలు వచ్చాయి. ఆ సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేసి శ్రావణ మాసంలో లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అప్పగిస్తామని టీడీపీ నాయకులు హామీలు గుప్పించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇళ్ల నిర్మాణం, గతంలో పూర్తి చేసిన ఇళ్లకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయలను కల్పించడంలో ప్రభుత్వ పెద్దలు అలసత్వం వహించారు. లబ్ధిదారులకు మంజూరు చేసిన రుణానికి సంబంధించి కంతులు చెల్లించాలంటూ ఇటీవల బ్యాంకర్ల నుంచి తీవ్ర ఒత్తిళ్లు మొదలయ్యాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

గతంలో పలుమార్లు డిపాజిట్ల సొమ్ము కోసం లబ్ధిదారులు కార్యాలయానికి వచ్చి వినతి పత్రాలు అందజేశారు. డిపాజిట్ల సొమ్ము వెనక్కు చెల్లించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. టిడ్కో గృహాల పెండింగ్ పనులను వేగవంతం చేస్తాం.

– శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్, తాడిపత్రి

క్లుప్తంగా

రేపు వైఎస్సార్ జయంతి

రాప్తాడు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఈనెల 8వ తేదీన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం అనంతరం కేక్ కట్ చేస్తామని పేర్కొన్నారు. పీహెచ్‌సీ వద్ద రోగులకు బెడ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ జయంతి వేడుకలకు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రాజేశ్వరికి 'దక్షిణ భారత మహిళా విజేత' పురస్కారం



అవార్డు అందుకుంటున్న నల్లాని రాజేశ్వరి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త నల్లాని రాజేశ్వరి ఆదివారం 'దక్షిణ భారత మహిళా విజేత' పురస్కారం అందుకున్నారు. చెన్నైలోని మద్రాసు క్రిస్టియన్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన పురస్కార ప్రదానోత్సవం జరిగింది. తమిళనాడు మానవ హక్కుల వేదిక, ట్వెల్ మేగజైన్, గ్లోబల్ పింక్ ఆర్మీ సంస్థల ప్రతినిధులు షెర్లీ జేసురాజ్ తదితరుల చేతుల మీదుగా రాజేశ్వరి అవార్డు స్వీకరించారు. అనంత వేదికగా కాలమిస్టుగా, సేవాతత్పరురాలిగా రాజేశ్వరి చేస్తున్న సేవలను నిర్వాహకులు కొనియాడారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి


పెంపుడు జంతువులకు టీకాలు వేస్తున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ప్రకాష్

రాప్తాడు: పెంపుడు జంతువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వాటికి సకాలంలో టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రకాష్ సూచించారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా రాప్తాడు పశు వైద్యశాలలో ఆదివారం పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనకు ముద్దుగా ఉండే పెంపుడు జంతువులు, ఇతరుల ప్రాణాలతో చెలగాటంగా మారకూడదన్నారు. పెంపుడు జంతువులకు తప్పనిసరిగా యాంటీ రేబీస్ టీకాలను వేయించాలన్నారు. అనంతరం పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు


నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: ద్వారకా నగర్‌లోని సంగీత సభలో ఆదివారం శ్రీ త్యాగరాజ సంగీత సభ 67వ వార్షికోత్సవం, సంగీత దిగ్గజం మంగళపల్లి బాలమురళీకృష్ణ, అనంత నాట్య పితామహుడు వరదాజ అయ్యంగార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సంగీత వాగ్గేయకారులు త్యాగయ్య, పురందరదాస, అన్నమయ్య పద సంకీర్తలపై చిన్నారులు అద్భుత రీతిలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బుగ్గయ్య చౌదరి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జనప్రియ కవి యంగన్న, సభ కార్యదర్శి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేద్దాం

అనంతపురం అర్బన్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

అనంతపురం కల్చరల్/రాప్తాడు/ఆత్మకూరు: కులమతాలకు అతీతంగా నిర్వహించే మొహర్రం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం ఆత్మకూరులో పెద్ద సరిగెత్తు నిర్వహించారు. భక్తులు తమ ఇళ్ల నుంచి పానకపు కుండలను డప్పుచప్పుళ్ల మధ్య పీర్ల చావిడి వద్దకు తీసుకొచ్చారు. పీర్ల స్వాములకు చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. సర్దార్ వలి దర్గాలో భక్తులు పెద్ద ఎత్తున చక్కెర చదివింపులు చేయించారు. మొక్కుబడి ఉన్న భక్తులు చెట్లను గుండలోకి వేశారు. బెంగళూరు నుంచి తీసుకొచ్చిన పూలమాలలను పీర్లకు అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి గ్రామంలో జల్లమ్మ స్వామికి చక్కెర చదివింపులు చేయించారు. జల్లమ్మ బావి వద్ద ఉన్న దర్గా వద్దకు వందలాది మంది మహిళలు, భక్తులు ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు. భక్తులు 10 బస్తాల చక్కెరను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా దర్గాను రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మొహర్రం ఉత్సవాల్లో జల్లమ్మ స్వామి పేరు మీద ఏర్పాటు చేసిన పీరుకు భక్తులు చదివింపులు చేయించారు. ఇక అనంతపురం నగరంలోని 5వ రోడ్డులో కొలువుదీరిన పెనుగొండ బాబయ్య, సయ్యద్ మస్తాన్ వలి, శ్రీకసమూరు ఖాలేషా మస్తాన్‌వలి, శ్రీహజరత్ మౌలాలి పీర్ల బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. చిన్న సరిగెత్తు సందర్భంగా యువకులు సందడి చేశారు. వివిధ పుష్పాలతో అలంకరించిన పీర్లను వాయిద్యాల హోరు నడుమ నగరవీధుల్లో ఊరేగించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. పవిత్రమైన మస్తాన్‌వలి, మౌలాలి పీర్ల జాతరలో భాగంగా సోమవారం పానకాల జాతర, అగ్నిగుండం ఏర్పాటు, మంగళవారం అగ్నిగుండం ప్రవేశంతో పాటూ అదేరోజు సాయంత్రం జలధికి పోతాయన్నారు, ఈనెల 10న చివరి దర్శనం, అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతాయని పేర్కొన్నారు.


అనంతపురంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


ఆత్మకూరు: సయ్యద్ సర్దార్ వలి దర్గాలో చదివింపులు


రాప్తాడు: అగ్ని గుండం వద్ద భక్తుల సందడి


ఆత్మకూరు: చెట్లను గుండంలోకి తరలిస్తున్న భక్తులు


రాప్తాడు: దర్గాలో పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా తొలి ఏకాదశి పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


అలంకరణలో పాండురంగ స్వామి


రాప్తాడు: పాలచెర్లప్ప ఆలయంలో అన్నదానం

అనంతపురం కల్చరల్/రాప్తాడు/ఆత్మకూరు: అనంతపురం నగరం, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు చోట్ల శ్రీవారికి విశేష పుష్పాలంకార సేవలతో పాటూ సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. రామనగర్‌లోని భవసార క్షత్రియ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయానికి ఉదయం 5 గంటల నుంచే భక్తులు బారులు తీరి దేవతామూర్తులను దర్శించుకున్నారు. రాప్తాడు మండల వ్యాప్తంగా ఆలయాల్లో తొలి ఏకాదశి సందడి నెలకొంది. బుక్కచెర్ల గ్రామానికి చెందిన కురుబ కులస్తులు కపాడం వంశస్తులు మండలంలోని పాలచెర్ల గ్రామంలో వెలసిన పాలచెర్లప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తొలుత అర్చకులు స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆకు పూజ అనంతరం పంచామృతాభిషేకాలు చేపట్టారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. స్వామి దర్శనానికి భక్తులకు గంటల సమయం పట్టింది.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్ రాం


నినాదాలు చేస్తున్న మేయర్ వసీం, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం గొప్ప సంస్కర్తగా విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని మేయర్ వసీం కొనియాడారు. బాబూ జగ్జీవన్ రాం వర్ధంతి సందర్భంగా ఆదివారం నగరంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్ రాం జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందన్న గొప్ప ఆలోచనతో ఆయన ముందుకెళ్లారన్నారు. బడుగులకు చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు కమల్ భూషణ్, ఇసాక్, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు శోభన్, కాకర్ల శ్రీనివాసులు, ఓబులేసు, తలారి వెంకటేష్ పాల్గొన్నారు.

'డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దు'


నరసనాయనికుంట సమీపంలో భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

రాప్తాడురూరల్: నగరానికి కూత వేటు దూరంలో ఉన్న అనంతపురం రూరల్ నరసనాయనికుంట శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల సర్వే నంబర్ 99లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయంపై గ్రామస్తులు పలుమార్లు కలెక్టర్, ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని విన్నవించారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ వినోద్‌కుమార్ ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములను పరిశీలించేందుకు పర్యటించారు. సమాచారం అందుకున్న నరసనాయనికుంట గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి తమగోడు వెల్లబోసుకున్నారు. పచ్చని పొలాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల కలిగే ఇబ్బందులను ఏకరువు పెట్టారు. పంటలపై ప్రభావం పడడంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని వాపోయారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని లేదంటే చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా కలిసికట్టుగా అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నకిలీ విద్యార్థి సంఘాలపై చర్యలు తీసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై నకిలీ విద్యార్థి సంఘాల బ్లాక్‌మెయిల్ ఎక్కువైంది. వీరి దందాలకు తట్టుకోలేకపోతున్నామని ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు వాపోయారు. నకిలీ విద్యార్థి సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా 'అపుస్మా' రాష్ట్ర కో-ఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో కొందరు నకిలీ విద్యార్థి సంఘాల పేరుతో చేస్తున్న అరాచకాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లను పెడుతున్న ఇబ్బందులకు వివరించామన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో యువతి అదృశ్యం

- కేసు నమోదుకు మొండికేసిన త్రీటౌన్, రూరల్ పోలీసులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ యువతి ఆర్టీసీ బస్టాండ్ నుంచి అదృశ్యమైనట్లు సీసీ కెమరాల్లో నిక్షిప్తమైనా కేసు నమోదుకు అనంతపురం త్రీటౌన్ పోలీసులు నిరాకరించారు. అమ్మాయి నివాసం రూరల్ పీఎస్ పరిధిలో ఉందని.. తమకు సంబంధం లేదంటూ తేల్చి చెప్పారు. మరోవైపు ఆర్టీసీ బస్టాండ్ నుంచి యువతి అదృశ్యమైందని.. అది త్రీటౌన్ పరిధిలోకే వస్తుందని అటు రూరల్ పోలీసులు కేసు నమోదుకు మొండికేశారు. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం నుంచి రాత్రి దాకా రెండు పోలీస్‌స్టేషన్లు తిరిగారు. ఎట్టకేలకు రాత్రి రూరల్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన ఉజ్జప్పప్పగారి రమేష్ కూతురు అనిత బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. పంటి నొప్పితో ఆస్పత్రికి వెళ్తున్నట్లు శనివారం ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. అమ్మాయి మొబైల్ ఇంట్లోనే ఉంచి వెళ్లడంతో ఆ మొబైల్‌ను పోలీసులు తీసుకుని పరిశీలించారు. అందులో ఆర్టీసీ బస్టాండులోని క్లాక్ రూంలో లగేజీ స్లిప్ ఫొటో ఉండటంతో ఆదిశగా విచారించారు. అక్కడ సీసీ కెమరాను పరిశీలించారు. ఈనెల 4వ బస్టాండ్‌లో లగేజీ రూంలో ఓ బ్యాగు ఉంచింది. వారు ఇచ్చిన స్లిప్‌ను మొబైల్‌లో ఫొటో కూడా తీసుకుంది. ఆ మొబైల్ ఇంట్లోనే పెట్టి 5వ తేదీ వెళ్లి లగేజీ తీసుకుని వెళ్లిపోయినట్లు స్పష్టమైంది. ఈ అమ్మాయి అదృశ్యం వెనుక ప్రేమ వ్యవహారం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది.

వ్యక్తి అనుమానాస్పద మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

అనంతపురం: మారుతీ నగర్‌లోని మంగళవారి కాలనీలో నివాసం ఉంటున్న కె.నరసింహులు అలియాస్ ప్రభాకర్ కుమారుడు రేకాంద్ర చంద్రశేఖర్ (45) అనుమానాస్పదంగా మృతి చెందాడు. అనంతపురం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలు.. రేకాంద్ర చంద్రశేఖర్‌కు శాంతాబాయితో వివాహమైంది. వీరికి జగదీష్, మానస సంతానం. సుమారు 5 సంవత్సరాల క్రితం భార్యాభర్తలు విడిపోయారు. శాంతాబాయి పిల్లలతో కలిసి కళ్యాణదుర్గంలో నివాసం ఉంటోంది. చంద్రశేఖర్ అనంతపురం నగరంలో పెయింటింగ్ పని చేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో అరవింద్ నగర్ పార్కులో సచివాలయంపై పడుకుని మృతి చెందాడు. అయితే కిందకి దిగే క్రమంలో పడిపోయి మృతి చెందాడా? ఇతర కారణాలతో చనిపోయాడా అనే విషయం తెలియాల్సి ఉంది. శాంతాబాయి ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజల పక్షాన పోరాడదాం


అనంత వెంకటరామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వెన్నం శివరామిరెడ్డి, చింతకుంట వెంకటేష్

అనంతపురం కార్పొరేషన్: 'ఎన్నికలకు ముందు అలివిగాని హామీలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు.. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజలకు చేసిన నయవంచనను ప్రజలకు వివరించాలి. అదేవిధంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలి' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమితులైన వెన్నం శివరామిరెడ్డి (ఎన్ఆర్ఐ), చింతకుంట వెంకటేశు ఆదివారం అనంతను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడలు వంచైనా ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. సామాజిక మాధ్యమాలు, వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డికి వెన్నం శివరామిరెడ్డి, చింతకుంట శ్రీనివాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కవులను ప్రోత్సహించడమే లక్ష్యం

అనంతపురం/అనంతపుర కల్చరల్: అనంత కవితా సామ్రాజ్యంలో యువత సమాజ నిర్దేశకులుగా మారుతుండటం శుభపరిణామమని పలువురు వక్తలు అన్నారు. లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సెంట్రల్ లైబ్రరీ కళావేదికలో శతాధిక కవిసమ్మేళనం నిర్వహించారు. అశోక్ కుమార్ రాసిన మౌనక్షరాలు కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన శశాంక్ మౌళి, డాక్టర్ అంకె రామలింగమయ్య తదితరులు యువ స్ఫూర్తిని కొనియాడారు. వివిధ సందర్భాల్లో కవితా సమ్మేళనాలు, సాహితీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ అధ్యక్షుడు వడ్డి సుధాకర్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, పొదిలి బాబూరావు, లైబ్రేరీ కార్యదర్శి రమ, విజయ్‌సాయి, పాట్లూరి కేశవ, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి


ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీ ఎరుకల సేవా సంఘం నాయకులు


అనంతపురంలో ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళి

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని కళాకారుల కాలనీలో ఆదివారం ఏపీ ఏరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి ఘనంగా జరిగింది. తొలుత ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ ఏరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే రాజశేఖర్ మాట్లాడుతూ.. ఎరుకల జాతి మూల పురుషుడు అయిన ఏకలవ్యుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంత మంది నాయకులు మారినా ఎరుకల జాతి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులు ఎరుకలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని తెలిపారు. ఏపీ ఎరుకల సేవా సంఘం నాయకులు పులివేందుల ఆది, సాకే పవన్ కుమార్, కదిరప్ప, రాధిక పాల్గొన్నారు.

ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని అశోక్ నగర్‌లో ఆదివారం ఎరుకల సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి నిర్వహించారు. ఆ సంఘం నాయకులు ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీ కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలన్నారు. ప్రభుత్వం ఎరుకల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్య, సామాజిక, రాజకీయంగా ఎదిగేందుకు తోడ్పాటునందించాలన్నారు. ఎరుకల సంఘం నాయకులు వై.వెంకటరామయ్య, రామాంజనేయులు, గుజ్జల మనోహర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాకే చిరంజీవి, శ్రీరాములు, వీర తదితరులు పాల్గొన్నారు.

మదన్‌మోహన్ రెడ్డి మృతి తీరనిలోటు


మదన్ మోహన్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మదన్ మోహన్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తపోవనంలో బి.మదన్‌మోహన్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. మంచి నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, పార్టీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు అనంత చంద్రారెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ

అనంతపురం: నగరంలోని టీవీ టవర్ వద్ద ఆదివారం గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ తెలిపారు. షికారి శివమ్మ అనే మహిళ నుంచి సుమారు 430 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు


లాడ్జీలో రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా లాడ్జీలు, హోటళ్లు, దాబాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల్లో జరుగుతున్న వ్యభిచారం, ఇతరత్రా అసాంఘిక కార్యకాలాపాలపై ఆదివారం సాక్షిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డేదీ? అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై జిల్లా ఎస్పీ పి. జగదీష్ స్పందించారు. అనంతపురం నగరంలోని ప్రతి లాడ్జీలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆదివారం రాత్రి లాడ్జీలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో బస చేసిన వ్యక్తుల వివరాలను పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరించారు.